ఆరోజు మా ఇంట్లో గ్యార్ వీ. మేము పిల్లలమంతా గదిలో ఆడుకుంటూ ఉంటే ఆపా వసారా సందులో కిటికీ ఊచను పట్టుకు నిలబడి మమ్మల్ని చూస్తూ నవ్వు నటిస్తూ ఉంది. కానీ మెలి తిరుగుతోంది. ఆమె భర్త సరైనవాడు కాదని నాకా వయసులోనే తెలుసు. ఎప్పట్నుంచో మదిలో సుడులు తిరుగుతున్నా ఇప్పటికి కథ రాయగలిగాను.

మహమ్మద్ ఖదీర్‌బాబు

# 12

# ఆపా





"అమ్మ బాదం చెట్టు కిందకి పొయ్యింది. నాయిన అన్నానికొచ్చాడు," అని పరిగెత్తుకుంటా వచ్చి చెప్పింది గోరీ. ఆపా కూతురు.

ఆ టైముకు మా ఇంట్లో డ్రా పొడైన మేజాబల్ల మీద రేడియోలో కార్మికుల కార్యక్రమం వస్తా ఉంది. నేను బడి నుంచి అన్నానికి వొచ్చి ఆ మధ్యాహ్నం ఎగ్గొట్టాలని ఆగిపోయున్నాను. గోరీ నాకంటే మూడేళ్లు చిన్నది. నేను ఐదో క్లాసు.

అమ్మ మసాలాబండ మీద నూరిన చింతపండు పచ్చడిని గిన్నెలోకి ఎత్తే ముందు ఒక వొలిచిన ఎర్రగెడ్డని నూరే రాయి కింద మెల్లగా ఒక దెబ్బ వేసి పచ్చడిలో కలిపి లేచింది.

"పద," అంది.

నేనూ వెనుకే వెళ్లాను.

మా ఇంటికి ఆరేడిళ్ల అవతల ఉంటుంది ఆపా ఇల్లు. తాటాకు ఇల్లు అది. సున్నం వేసిన మట్టిగోడలు. నేల గచ్చు చేసి ఉంటుంది. ముందు గుంజ వేసి నిలబెట్టిన వసారా. వెనుక పెద్ద కొట్టంలాంటి గది. దానికి ఒక మూలగా మట్టిపొయ్యి. గోడకు కొట్టిన చెక్కపలకల మీద వంట గిన్నెలు. ఉప్పు, కారం, నూనె సీసాలు.

వంట చేసి పొయ్యి ఆర్పిన ఆనవాలు ఉంది. పక్కనే అన్నం దబర, చారుగిన్నె ఉన్నాయి. భాయ్‌జాన్ వచ్చే ముందే ఉడికిన గుడ్డు గాని, వచ్చాక అట్టుగాని ఏర్పాటుచేస్తా ఉంటుంది. ఇవాళ ఉడికిన గుడ్డే.

అమ్మను చూసి భాయ్‌జాన్ నులక మంచం మీద నుంచి లేచి నిలబడ్డాడు.

"నువ్వొచ్చావేంది వొదినా," అన్నాడు చిన్న గొంతుతో.

"నువ్వు అన్నం పెట్టుకొని తినలేవుగా. మగ మహారాజువి. నీ కూతురు నన్ను పిల్చకొచ్చింది," అంది అమ్మ గిన్నెల దగ్గరకు పోయి, పళ్లెం నీళ్లతో తొలిచి, చాపేసి అన్నీ నేల మీద అమర్చి,

"పో... పోయి తినుపో," అంది.

"అది ఇప్పుడల్లా రాదా. ఏందో కొత్తగా నేర్చింది," అన్నాడు పోయి కూచుంటా.

అమ్మ నేనేదైనా కింద పడేసి పగలగొట్టినప్పుడు చూసే చూపుతో భాయ్‌జాన్‌ని చూసింది. నా చేయి పట్టుకొని వసారా నుంచి బయటికి వచ్చి పెరటి వైపు నాలుగడుగులు వేసి ఆగింది.

చిన్న చిన్న ఇళ్లుండే మా వీధిలో ఆ ఒక్క ఇంటికి అంత పెద్ద పెరడు ఉంటుంది. అది వీధిలోకి కనపడదు. పొదలు, కంపలు, ఎవరూ వేయకుండానే పెరిగిన సీతాఫలం చెట్లు, బూరుగమాన్లు. చివర బాదంచెట్టు, చేదబావి. పక్కన తడికల హమామ్. కొంచెం దూరంగా మనిషొచ్చి ఎత్తుకుపోయే దొడ్డి. యజమాని ఈ స్థలం కొని పరాయివాళ్ల హవాలా అయిపోకుండా పూరికొట్టం వేసి నామ్ కే వాస్తేగా అద్దెకు ఇచ్చాడు. ఇలాంటి ఇళ్ల కోసం భాయ్‌జాన్‌లాంటి వాళ్లు పెళ్లి చేసుకొని బిడ్డను కని రెడీగా ఉంటారు కాబోలు.

దూరంగా బాదంచెట్టూ దాని కింద ఆపా కనిపిస్తా ఉన్నారు. ఆపా ఆ మాను దగ్గర స్థిమితం లేనట్టుగా అటూ ఇటూ కదలతా మమ్మల్ని చూస్తా ఉంది. అమ్మ నా చేయి వదలకుండా ఆపా వైపు చూస్తా నిలబడింది. ఆపా అలవికానట్టుగా పాదాలు నేలకేసి రుద్దతా అడుగులు వేస్తా అమ్మ వైపు చూస్తా, 'వెళ్లు వెళ్లు,' అని చేయి ఊపింది.

మేం వొచ్చేశాం.

ఆ రాత్రి మా నాయిన పని నుంచి వొచ్చి, చొక్కా ప్యాంటూ తీసి హ్యాంగర్‌కి తగిలించి, పదైందని కూడా కనికరించకుండా అమ్మ చేత పొంతలో నీళ్లు పెట్టించి టవలు కట్టుకుని నిలబడ్డాడు నీళ్లు వేడయ్యేదాకా.

అమ్మ మధ్యాహ్నం జరిగింది నాయినతో చెప్పింది. నాయిన గమ్మున్గా విన్నాడు. కోపంగా ఉన్నట్టుగా కూడా అవుపించాడు.

"ఇది ఎలా చేయాలో ఏమో," అని నాయినతో అమ్మ అంది.

మా ఊరి సరిహద్దు ముగిసి ప్రకాశం జిల్లా సరిహద్దు మొదలయ్యే దగ్గర ఉండే 'తెట్టు' అనే ఊరి నుంచి ఆపా వాళ్ల అమ్మ రెండు వారాల కిందట మా ఇంటికి వచ్చి అమ్మ దగ్గర మాటకు కూచుంది గోడకి ఆనుకుని. బొడ్డున ఉన్న సంచి నుంచి పువ్వాకు తీసిందిగాని బుగ్గన పెట్టుకోలేదు. డీలాగా ఉంది. తెట్టు చుట్టుపక్కలున్న చిట్టడవి నుంచి ఎండు కట్టెలు కొట్టి పాసింజర్ రైలులో మా ఊరికి తెచ్చి అమ్మ్తుతుం టుందామె. ఆపా ఆమె పెద్దకూతురు.

"ఏందో చెప్పదు... గాలో పాడో సోకిందేమో చూడు అమాయా. ఎందుకట్టా ఈమద్య తడవ తడవకు వెళ్లి బాదంచెట్టు కింద నిలబడతా ఉందట అమ్మి," అంది.

అమ్మ ఆమెవైపు చూసింది.

"ఎవరు జెప్పారు. నాకు చెప్పనే లేదే అమ్మి. ఏమైందంట?" అంది.

‘‘ఏమో... అల్లుడికి ఏదైనా వొండి పెట్టద్దని కూరాకు డబ్బులు ఇచ్చి పోదామని వస్తే బాదంచెట్టు కింద ఉంది అమ్మి. నీ కూతురు నాల్రోజులుగా చెట్టు కిందకు పోతా ఉంది... ఆడెవడున్నాడో కనుక్కో అని కూరాకు డబ్బు తీసుకెళ్లాడు అల్లుడు’’...

ఆమె వల్ల అలా అమ్మకు మొదటిసారి బాదంచెట్టు సంగతి తెలిసింది.

‘‘సరేలే అత్తా... నేను కనుక్కుంటాలే,’’ అంది.

‘‘ఏదో ఒక బందుత్వం ఉందని, నువ్వు ఈడ ఉన్నావని వచ్చి జేరింది నా కూతురు. దాన్ని నువ్వే కనిపెట్టుకోవాల అమాయా,’’ అని కంటతడి తుడుచుకుంటా కట్టెలు మోసేందుకు వాడే తువ్వాలును చుట్ట చుట్టుకుంటా లేచింది.

ఆ సాయంత్రం అమ్మ, నేను ఆపా ఇంటికి వెళ్తే గోరీకి స్నానం చేయించి టీ మరిగిస్తా ఉంది. చెట్టు కింద లేదు.

‘‘ఏమ్మే... నీకేదో బాగలేదంటనే,’’ అంది అమ్మ.

‘‘ఆ... ఏం లేదకా. కడుపునొప్పి.’’

‘‘డాక్టర దగ్గరికి పోతే ఏమి,’’ అంది అమ్మ.

‘‘ఆ... ఇంతదానికి డాక్టరకాడికి పోయి మందుచీటి కూడా రాయించుకుంటాం. నువ్వు మరీనకా,’’ అని ఉన్న టీలోనే రొంత ఇస్తా నవ్వింది, నవ్విందా అన్నట్టుగా.

రెండు రోజులు గడిచేసరికి నూనెలో గొట్టాలు వేగించి వాటిని పది పది లెక్కన కవర్లలో పెట్టి దుకాణాలకు వేసే నూర్జానక్క మా ఇంటికి వచ్చింది చెమటలు పట్టి. ఆపా పక్కిల్లు ఆమెది.

‘‘ఏందకా అమ్మి చేష్టలు. దడెత్తుకొచ్చి నీకాడకొచ్చా,’’ అంది.

‘‘ఏమైందిమే,’’ అంది అమ్మ అదురుపోతా.

‘‘పక్కిల్లే గదా. అంతా తెలస్తానే ఉంటుంది. వంటచేస్తా ఉందని గమనించానా... కాని రొంచేపటికి మెల్లిగా ఎర్రి పట్టినట్టుగా అరస్తా బాదంచెట్టు కాడికి పరిగెత్తింది. ఆ తర్వాత చెట్టు కాణ్నుంచి ఇంటికి, ఇంటి కాణ్నుంచి బాదంచెట్టుకి. ఒకటే దౌడు. నాకు బయంపుట్టి పోయింది. ఎళ్తే ఏం ఆగమోనని నీకాడికొచ్చా. నోరు విప్పి ఏం చెప్పదు గదా ఆ అమ్మి,’’ అంది.

మా అమ్మ ఏంతోచక కనుగుడ్లు అట్టే నిలబెట్టింది. ఆపాను పూసగుచ్చి అడిగేంత బంధుత్వం కాదు మాది. అలాగని అడగకూడనంత చుట్టరికం కూడా కాదు. నూర్జానక్క తెచ్చిన న్యూస్‌ను ఆ రాత్రి మా నాయిన చెవిన వేసింది మా అమ్మ.

మూడు నాలుగు రోజుల తర్వాత మా నాయిన డజను అరటిపండ్లు కొని కొసరుగా బండివాడు ఇచ్చిన పదమూడో కాయ కూడా ఇంటికి తెచ్చాడు. మామూలుగా ఆయన దాన్ని రోడ్డమ్మట తినుకుంటా వచ్చి ఇంట్లోకొచ్చే ముందు తొక్క బయటపడేస్తాడు. ఆ రోజు వాటంలో తేడా ఉంది. స్నానం చేసి అన్నానికి

కూచునే దాకా గమ్మున్గా ఉండి అరచేతిలో కట్టిన ముద్దను అట్టాగే పట్టుకొని, “ఏందా హరాము నా కొడుకు,” అన్నాడు.

మా అమ్మ అదురుపాటుగా చూసింది. పిలకాయలను ఇట్టాంటి టైములో దూరం పంపేదానికి ఉండేది మహలు కాదు. జానా బెత్తెడు పెంకుటిల్లు. రాత్రిపూట.

“ఏమైంది,” అంది.

‘డాక్టరు కోటిలింగం కలిశాడు దార్లో. ఏం భాయ్... ఆ ఎర్రటి కంకర సాయెబు నీ బందువే కదా. కోర్సుకు నాలుగురోజులు వచ్చి మళ్లా మానుకున్నాడు. అతనికున్నది గబ్బురోగం. పెన్సిలిన్లు ఏస్తా పోయినా తగ్గతదని చెప్పలేము. పంచెల్లో ఉన్నది అదిమి పెట్టుకొని బతకడం నేర్చుకోరు కొందరు. ఏదో ఒకటి తగిలించుకుని మాకాడికి వస్తారు. మాన్పిద్దామంటే సగం నుంచి అవుపడకుండా పోతారు అన్నాడు”...

మా అమ్మకు అర్ధమైంది.

“అదా సంగతి. అదన్నమాట అయితే. ఆ సత్తినాశినంగాడు ఇట్టాంటి గన కార్యాలు చేస్తుండబట్టేనా అమ్మి ఆ వాటాన అల్లాడిపోతా ఉంది,” అంది దవడలు గట్టిగా బిగిస్తా.

నాయిన బదులు పలక్క ముద్ద నోట్లో పెట్టుకున్నాడు.

మా అమ్మకు నడినెత్తికి వచ్చింది.

“బాడ్కవ్‌గాళ్లు బజార్లకెళ్లి ఆ పని ఈ పని చేసి నాలుగు రూపాయలు తెచ్చి పెళ్లాలకివ్వాల. చాలక గూడల్లో దమ్ముంటే సక్కగా చూసుకోవాల. అదీ మగతనం అంటే. ఇట్టా పుచ్చిపోయే రోగాలన్ని తెచ్చి పెళ్లాలకిస్తే ఆ ఆడాళ్లు ఏమైపోవాలా? తెగులుమొకం నాయాళ్లు... తప్పుడు పన్లు చేసి తప్పుడు రోగాలు వొచ్చాయని తెలిసి గూడా రాత్రయితే చాలు పెళ్లాల మీదకి ఎక్కేస్తారు. ఎంత తప్పు అది. అంటద్దని తెలియదా ముచ్చంగి ఎదవలకి. పొయ్యిలోని కాలే కట్టె తీసి యాణ్ణో పొడవాల ఇట్టాంటి బోసడీగాళ్లకి”...

మరుసటి రోజు ఆదివారం. భాయ్‌జాన్ కంకర కోసం రెండ్రోజులు లైను మీదకు పోయాడని మా అమ్మకు తెలిసింది. ఇళ్లు కట్టడానికి శ్లాబులు ఫ్యాషన్ అవుతున్నందున బులుగు కంకరకు గిరాకీ వచ్చింది. దాన్ని తెప్పించి అమ్మే రెడ్డిగారి దగ్గర భాయ్‌జాన్‌కి పని. టైరుబండికి ఇంతని, ట్రాక్టర్‌కు ఇంతని, లారీకి ఇంతని లెక్కలు చూసిపెడ్తే కొంత చిల్లర దక్కతా ఉంటుంది.

ఆ మధ్యాహ్నం బోటీకూర తిని, అందరం జిడ్డు చేతులు కడుక్కుని, మా నాయిన ముఖం మీద టవలు వేసుకుని నిద్రపోయేదాకా ఆగి, మా అమ్మ నేనూ ఆపా ఇంటికి వెళ్లాం.

“నామర్దాగా అనుకుంటావేమోనని నేనొండిన ఫారమ్‌కోడి కూర పంపలేదకా,” అంది ఆపా.

“మేము అంతకంటే నామర్దాగా బోటీ వొండుకున్నాములే అమాయా,” అంది అమ్మ.

మాంసం తప్ప ఇంకేం వొండుకున్నా నామర్దాయే మాకు.

ఆపా మేం వొచ్చామని కళ తెచ్చుకుని అటూఇటూ అడుగులు వేసింది. అమ్మకు ఎదురుగా  కింద కూచుంది. గోరీ నేనూ గోడ మీద నుంచి పెరక్కొచ్చిన వాల్‌పోస్టర్‌ని చూస్తా మాట్లాడుకుంటా ఉంటే మా అమ్మ మా ఇంటి నుంచి తెచ్చిన తమలపాకుల తొడిమలు తీస్తా అంది,

“అమాయా. నేనూ ఆడదాన్నే. నీకంటే ముందర పుట్టినదాన్నే. నాకూ ముకమూ మొలా ఉన్నాయి. నాకన్నీ తెలుసు. డాక్టరకాడికి పోకపోతే ఇట్టాంటివి తగ్గవు. రేప్పొద్దున పదకొండు గంటలకి పెద్దాస్పత్రికి పోదాము. రెడీగా ఉండు”...

ఆపా ఏమీ చెప్పలేదు.

“చెప్పేది నీకేనమ్మే నిద్రమొకందానా.”

“అకా... నన్ను నా మానాన కాపరం చేసుకోనీ. ఎందుకు మళ్లా కట్టెలు కొట్టుకొని పాసింజర్లలో తిరిగే బతుక్కి తీసుకెళతావు,’ అంది కాళ్ల బొటనేళ్లు నిమురుకుంటా.

“ఏందిమే అట్టంటావు.”

‘మరేమననకా. డాక్టర కాడికి పోయి నాకిదొచ్చిందని ఎట్టా గుడ్డ తప్పించి చూపించేది. మానం మర్యాద ఉండే ఆడది చేసే పనేనా అది. ఒకేల చూపిస్తే డాక్టర ఊరికే ఉంటుందా? మందులకు చీటీ రాసిస్తుంది. వాట్ని కొనుక్కోవాలంటే డబ్బులా? ఒకేల కొనుక్కున్నామే పో... ఇంట్లో వాట్ని చూస్తే ఊరుకుంటాడా ఈ మనిషి... నన్ను బజారున పెట్టి ఊరంతా టాంటాం చేస్తున్నావే రండీ అనైనా అంటాడు. లేదంటే నీబోటోళ్లో దూలేజాన్ లాంటోళ్లో దబాయించి అడిగితే నా వల్ల అనేంది... దాని వల్లే నాకొచ్చుంటుంది... ఎవరికి మరిగిందో ఏమో అని అడ్డమైనా తిరుక్కుంటాడు. దానిని నమ్మేవాళ్లు కూడా ఉంటారు. అప్పుడు గ్యారంటీగా బావిలో పడి సావాలి నేను. ఇదంతా పడాలా అకా”...

అమ్మ ఊరికే ఉండిపోయింది.

“ఈ మనిషి కాళ్లూగడ్డాలు పట్టుకుని మా అమ్మ నన్ను కట్టబెట్టింది. నన్ను ఏలుకుంటున్నాడు చాలు. ఎట్ట తిరుగుతున్నా చూసి కళ్లు మూసుకోగలను తప్ప ఇట్టాగే తిరుగు అని ఏడ చెప్పగలననకా?” అంది.

అమ్మకు సగం బలం పోయింది.

“మరి ఈ బాదంతా ఎలా బరిస్తావుమే,” అంది గొంతు నీళ్లవుతుంటే.

‘బరిస్తానకా. అయినా ఏం బాదలే. రోజంతా ఉండదు. మామూలుగా ఉన్నట్టే ఉంటుంది. కాని ఉన్నట్టుండి ఏదో అయిపోతుంది. ప్రాణం లాగేస్తా ఉన్నట్టు.

కుక్క కొరికేస్తా ఉన్నట్టు. చర్మం జివజివలాడిపోతా నవ్వ రేగిపోతా ఉన్నట్టు. అప్పుడు మాత్రం ఏం తోచదు. మైండ్ తిరిగిపోతుంది. పరిగెడతాను. బాదంచెట్టు కిందకెళ్లి పరిగెడతా ఉంటాను. ఒక్కోసారి ఆ అవస్థ పది నిమిషాలు ఉంటుంది. ఒక్కోసారి గంటా రెండు గెంటలు ఉంటుంది. అప్పుడు ఏమీ చేయలేను. చెట్టు కింద నుంచి కదల్లేను. దొంగలు పడి ఉన్నది కాస్త దోచుకుపోతా ఉన్నా చూస్తా ఉండిపోవాల్సిందే. కాళ్ల మధ్య కొరివంటుకున్నట్టుంటుందకా''...

ఇరవై ఐదు ఇరవై ఆరుకు అటూ ఇటూ ఉంటాయి ఆపాకు. కాని మా అమ్మ కంటే పెద్దదిలా అవుపిస్తా ఉంది.

ఆ మరుసటిరోజు నుంచి అమ్మ ఆపాకు నిజం అక్క అయిపోయింది. అసలామె ముక్కోపి మనిషి. కాని ఆపా కోసం చాలా నిమ్మళం అయిపోయింది. గోరీకి ఏదైనా కావాల్సి వస్తే ఆ టైముకి ఆపా చెట్టు కింద ఉంటే నూర్జానక్క ఆ పని అందు కునేది. భాయ్‌జాన్‌కు వంట పేచీ రాకుండా వడ్డన పేచీ లేకుండా అమ్మ చూసుకునేది. అయితే ఆపా చెట్టుకింద అట్టా గంటలు గంటలు ఎందుకు నిలబడతా ఉందో ఎవరూ భాయ్‌జాన్‌ని అడిగేవారు కాదు. ఎదురు భాయ్‌జానే అందరినీ అడగతా ఉండేవాడు.

ఒకరోజు ఆపా సంచిలో ఏదో తీసుకుపోతా ఇంటి ముందర ఆగింది.

''ఏందమయా అది,'' అంది అమ్మ.

''ఇసకకా,'' అంది ఆపా.

''దేనికి?''

''ఏం చెప్పమంటావులే నా బాధ,'' అని వెళ్లిపోయింది.

ఆ తర్వాత నూర్జానక్క చెప్పింది. ఉండి ఉండి ఆపా చిన్నగొంతుతో కీచుగా అరస్తా బాదంచెట్టు కిందకు పోయేదట. వల్లనవుతుందేమోనని చూసేదట. వల్లగాక పోతే ఇసక తీసుకొని తడికెల హమామ్‌లోకి వెళ్లి గుడ్డలిప్పి ఒళ్లు మొత్తం పొట్టంతా ఎట్ట బడితే అట్ట ఇసకతో రుద్దుకునేదట. ఆ తర్వాత అర్ధగంటా గంటకు నీళ్లు బోసుకొ నొచ్చి ఇప్పుడు ప్రాణం వొచ్చిందకా అనేదట.

ఆపా నొప్పికి మందు ఇసకలో ఉందని నాకు అర్థమయ్యింది. స్కూలు నుంచి వచ్చాక ఇళ్లు కట్టే చోట్లకంతా తిరగతా యాడైనా ఇసక ఉంటే సంచిలో పోసుకొని తెచ్చి ఆపాకు ఇస్తా ఉండేవాణ్ణి. ఇసక తడిగా ఉంటే ఆపా దానిని యూరియా పట్టా మీద ఆరబెట్టి పొడిగా మార్చుకునేది.

నెలరోజులేమో దాటిపోయాయి. ఒకరోజు సందేళ గోరీ వచ్చి, 'అమ్మకేం బాగ లేదు,'' అని కదలక మెదలక నిలబడిపోయింది. ఆ అమ్మికి వాళ్లమ్మ గురించి ఏమర్థ మయ్యిందో.

అమ్మ వెళ్లేసరికి ఆపా మంచాన తనకలాడతా ఉంది. చెట్టు కిందకు పోయే సత్తువ ఆపాకు పూర్తిగా పోయింది. బక్కగా అయ్యింది ఆపా.

"నా కూతుర్ని నువ్వు పెంచుకో అకా. నన్నిట్టా పోనీ. ఏరా... గోరీని చూసుకుంటావుగా. ఆడుకో దానితో," అంది.

"చెప్పుతో కొడతా. ఏం మాటలయ్యి. పోవడానికి రెడీ అయ్యావటే. దానికింకా చానా టైముంది. ముసిల్దానివై పోవాల్సిందే నువ్వు," అంది అమ్మ.

అమ్మ ఏడ్వడం మొదటిసారి నేను చూడటం.

ఇంట్లో చీకటిగా ఉంది. అమ్మ లైటేసింది.

"అకా... అకా," అంది ఆపా అమ్మ చేయి పట్టుకుని.

"సామీ... పుట్టేషావలీ... ఈ దురదృష్టవంతురాల్ని కాపాడయ్యా. నేనూ పేదరాలినే. కాని నీ పేరున పదిమంది పేదోళ్లకి పది బాసన్ల అన్నం పంచతా," అని అమ్మ బిగ్గరగా అంటా మొక్కుకుంది.

నూర్జానక్కను పిలిస్తే ఇద్దరూ ఏదో మాట్లాడుకుని గోరీని నాతో ఇంటికి పంపించి చడీచప్పుడు కాకుండా రిక్షాలో ఆపాను తీసకపోయారు. నాయినతో ఉన్న పరిచయానికి కోటిలింగం డాక్టరు ఏదో ఒకటి చేయకపోడు అని వాళ్లు అనుకోవడం విన్నాను.

మరో మూడు నెలలు గడిచిపోయాయి. భాయ్‌జాన్‌కు ఇంకేదో పని దొరికితే ఆపా వాళ్లు ఆ ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయారు. పోయే ముందు ఆపా వచ్చి నా చేతిలో బలవంతంగా ఒక రూపాయి బిళ్ల ఉంచింది. గోరీ నాకు టాటా చెప్పింది.

ఆ రాత్రి అన్నాల దగ్గర అమ్మ మొత్తం కథంతా గుర్తు చేసుకుని, "దేముడు దాని మొకం చూశాడు," అంది. "ఈ శుక్రవారం ముడుపు చెల్లిస్తాను," అని నాయిన దగ్గర పర్మీషను కూడా తీసుకుంది.

నేను ఇష్టంగా వెళ్లి అమ్మ వొళ్లో కూచున్నాను.

ఫేస్‌బుక్

*7 డిసెంబర్ 2020*

✻




మహమ్మద్ ఖదీర్‌బాబు 28 ఏప్రిల్ 1972న నెల్లూరు జిల్లా కావలిలో జన్మించారు. మొదటి కథ పుష్పగుచ్ఛం 1995లో ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో అచ్చయ్యింది. *దర్గామిట్ట కథలు, పోలేరమ్మ బండ కథలు, న్యూ బాంబే టైలర్స్, బియాండ్ కాఫీ, మెట్రోకథలు* కథాసంపుటాలు; *ఛాకన్, కింద నేల ఉంది, గెట్ పబ్లిష్డ్* ఏక కథా సంపుటులు ప్రచురించారు. సేకరించిన ముస్లిమ్ మౌఖిక కథలు, హిందీ సినిమా పాటలపై పుస్తకాలు, *కథలు ఇలా కూడా రాస్తారు*, కథా పరిచయ గ్రంథాలు- *నూరేళ్ల తెలుగు కథ, స్త్రీల కథలు-50* ప్రచురించారు. ఉత్తమ వానకథలు, హిందూ-ముస్లిమ్ మైత్రి కథలకు సంపాదకులు. సాక్షి దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్.

***చిరునామా: 502, మంజీర స్మార్ట్ హోమ్స్, కుత్బుల్లాపూర్, హైదరాబాద్.***

***ఫోన్: 97054 44243 khadeerbabu@gmail.com***